స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం తాటితూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి చదువుతున్న 50 మంది పేద విద్యార్థులకు 2024-2025 పబ్లిక్ పరీక్షలకు గాను ఫీజు, స్టడీ మెటీరియల్ నిమిత్తం కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ వారి స్వగృహంలో పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కల్లిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్ ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు ఊడికల శ్రీనివాస్‌రావు, టీఎస్‌వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ స్థలం

- అక్రమణలో 13 ఎకరాల 80 సెంట్లు స్థలం
- దీని విలువ వంద కోట్లుపైనే
- అక్రమార్కుల చేతిలో గ్రామకంతం
- ఫెన్సింగ్ వేసి షెడ్‌ల నిర్మాణం
- రక్షణగా సెక్యూరిటీ ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు

స్థలంలో రేకుల షెడ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గంభీరం గ్రామంలో అతి విలువైన భూమిని కొట్టేయడానికి వందల కోట్ల విలువచేసే సర్కార్ భూమిపై కొందరు బడా బాబులు కన్నేశారు. వివరాల్లో వెళితే గంభీరం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 140లో 13.80 ఎకరాలు గ్రామకంతం సర్కారు స్థలం సుమారు అప్పట్లో 100 కుటుంబాలు ఉండేవి. దానిలో యాదవులు, చాకలి, ఎస్సి, సరాబులు, పద్మశాలీలు అనేక జాతులు ఉండేవారు. దానిలో 1980లో ఇందిరాగాంధీ ఎస్సీ వారికి నేషనల్ హైవే 5 ప్రక్కన స్థలంలో భూమి కొనుగోలు చేసి ఇచ్చారు. దానివలన ఎస్సీ వారు అక్కడికి వెళ్లిపోయారు. చుట్టుపక్కల కొండలు ఉండేవి, ఉండడానికి కొండల మధ్య అడవి ప్రాంతం లాగా ఉండడం వల్ల భయపడి అందరూ గ్రామాలకి అక్కడి నుండి వెళ్లిపోయారు. ఎస్సీ వారికి ఐదు సెంట్లు చొప్పున ఇవ్వడం వలన గ్రామస్తులు అందరూ కలిసి అక్కడ పనులు మొదలు పెట్టుకుని ఇక్కడి నుంచి వెళ్ళిపోయారు. అప్పటినుండి స్థలం ఖాళీగా ఉండడం చూసి, రెవెన్యూ అధికారులు అప్పట్లో ఏపీఐఐసీకి అప్ప గించారు. ఏపీఐఐసి వారు తీసుకోవడానికి ప్రయత్నం చేయగా అప్పట్లో గ్రామస్తులంతా అడ్డుపడ్డారు. ముగ్గురుపై అప్పట్లో ఏపీఐఐసీ వారు కేసులను నమోదు చేయగా స్థానిక ప్రజలు కోర్టుకెళ్లారు. అప్పటి నుండి ఏపీఐఐసీ అప్పటి తహశీల్దార్‌కి భూమి రెవెన్యూకి అప్పగించారు. ప్రస్తుతం ఆ భూమిని రెవెన్యూ అధికారులు గ్రామకంతం కనుక పంచా యతీకి అప్పజెప్పారు. అప్పటినుండి పంచాయతీ ఆధీనంలో ఉన్న భూమి సర్వేనెంబర్ 140లో 13 ఎకరాల 80 సెంట్ల విస్తీర్ణం గ్రామకంతం భూమి కొంతమంది అక్ర మార్కుల చేతిలో ఉంది. ఆ స్థలంలో చుట్టూ నాలుగు సంవత్సరాల క్రితం ఫెన్సింగ్ వేసి మధ్యలో రేకుల షెడ్లు నిర్మించి స్థలం మాదే అంటూ ఎవరు వచ్చిన చెప్పడానికి ఒక వాచ్‌మెన్‌ను స్థలానికి రక్షణగా కాపలా పెట్టారు. నాటినుండి నేటి వరకు పంచాయతీ వారు గానీ రెవెన్యూ అధికారులు గానీ కోట్ల విలువైన భూమిని కాపాడుకోవాలని దాఖలాలు అయితే లేవని గంభీరం పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. అలాగే ఈ స్థలానికి ఆనుకొని ఉన్న సుమారు 50 సెంట్లు ప్రభుత్వ స్థలంలో ఈ మధ్యకాలంలో ఫెన్సింగ్ వేసి స్థలాన్ని కబ్జాదారులు ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ స్థలం, గ్రామ కంతంలో ఏవైనా కంపెనీలకు ఇచ్చినట్లయితే చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలతో పాటు, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తద్వారా పంచాయతీకి నిధులు సమకూరు తాయని, అందువల్ల రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని 100 కోట్ల పైన విలువైన భూమిని బడాబాబులు చేతిలో నుంచి తీసుకొని ప్రభుత్వ భూమిని రక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

భక్తుల మనోభావాలను కాపాడాలి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డు సింహాద్రి నాథుని తొలిపావంచా వద్ద విశ్వహిందూ పరిషత్, బీజేపీ మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల సింహాచలం దేవస్థానంలో జరుగుతున్న అవకతవకలపై ఓ పరిచారకులు, కొంతమంది సిబ్బంది, ఇతర శాఖ ఉన్నతాధికారులు తమ అధికారంతో ఎవరికి నచ్చినట్టు వారు నచ్చిన రీతిలో విధులు నిర్వహిస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు పూడిపెద్ది శర్మ, మీసాల, బీజేపీ నాయకురాలు మాధవి తదితరులు ఆరోపిస్తున్నారు.సదరు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావుకు వినతిపత్రం సమర్పించారు.

రెడ్డి సత్యనారాయణ మృతి బాధాకరం

విశాలాంధ్ర - సింహాచలం: నిరాడంబరులు, మాడుగుల నియోజకవర్గం మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మాస్టారు (99) మృతి బాధాకరమని విశాఖ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన ఒదిగి ఉండే మనస్తత్వం రెడ్డి సత్యనారాయణది అని అన్నారు. ఆయనతో తనకు ఉన్న అనుబంధం మర్చిపోలేనిదన్నారు. స్వర్గీయ రెడ్డి సత్యనారాయణ సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, విద్యార్థి దశ నుండే రాజకీయ లక్షణాలు అలవర్చుకొని తాను చదివిన విద్యతో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి విధులు నిర్వర్తిస్తూనే రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ చేయాలన్న సంకల్పం ఆయన మదిలో నాటుకు పోయిందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా మాడుగుల నియోజకవర్గంలో ఆయన చేసిన అభివృద్ధి ఎప్పటికీ ప్రజలు మరువలేరన్నారు. ఆయన పలు రిజర్వాయర్‌ల నిర్మాణానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

11 నుంచి గీతంలో బాలల సైన్స్ కాంగ్రెస్

విశాలాంధ్ర - మధురవాడ: బాలలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంచడానికి, నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జెఎన్‌వి) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నవంబర్ 11వ తేది నుంచి 15వ తేదీ వరకు ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ -2024ను నిర్వహిం చనున్నారు. దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు ఈ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు హాజరు కానున్నారు. దీనికి గాను ప్రతిభ గల విద్యార్థులను జెఎన్‌వి తరుపున ఎంపిక చేశారు. కాగా గీతంలో జరుగుతున్న బాలల సైన్స్ కాంగ్రెస్ విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు. శాస్త్ర విజ్ఞానంలో వస్తున్న మార్పులు, ఆసక్తి కర పరిశోధనలపై ప్రసంగాలతోపాటు విద్యార్థులకు గీతంలోని అధునాతన ప్రయోగశాలలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. సైన్స్‌లో సందేహాలను సహితం నివృత్తి చేసేందుకు గీతం పరిశోధకులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ సామాజిక బాధ్యత స్ఫూర్తిదాయకం

జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ విశాఖ నగర కాలుష్య నియంత్రణకు సామాజిక బాధ్యత వహించి చాలా కృషి చేస్తుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన రెండవ జోన్ ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద హెచ్.పి.సి.ఎల్. సహకారంతో నగర కాలుష్య నియంత్రణకు 88 లక్షల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి నిధులతో 26,500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణన్‌తో కలిసి శ్రీకారం చుట్టి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు హెచ్.పి.సి.ఎల్. సామాజిక బాధ్యతతో అందిస్తున్న మొక్కలను నగర పరిధిలో కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కొరకు లబ్ధిదారులను, ప్రజలను కూడా భాగస్వాములను చేస్తూ పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంగనాథన్ రామకృష్ణన్‌తో కలిసి మొక్కలను నాటారు. ఈ ఆవరణలో మొక్కలు నాటి ఒక నందనవనంగా తయారు చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణను కమిషనర్ ఆదేశించారు. అలాగే హెచ్.పి.సి.ఎల్. ఒక సామాజిక బాధ్యతగా భావించి విశాఖ కాలుష్య నిర్మూలనకు విశేష కృషి చేస్తున్నందుకు గాను హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముడసర్లోవ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ అభివృద్ధికి హెచ్.పి.సి.ఎల్. విశాఖ రిఫైనరీ సామాజిక భాధ్యతతో సహకారం అందిస్తున్నందుకు ఆ ప్రాంతాన్ని హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జివిఎంసి కమీషనర్ ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధికి, కాలుష్యం నిర్మూలనకు హెచ్.పి.సి.ఎల్. ఎప్పుడు తన వంతు సామాజిక బాధ్యతగా వహించి సహాయ సహకారాలు అందించుటకు సిద్ధంగా ఉందని కమిషనర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ప్రధాన ఇంజనీరు పి.శివ ప్రసాద రాజు, పర్యవేక్షక ఇంజనీరు గోవిందరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, ఎ.ఎం.ఓ.హెచ్. డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, హెచ్.పి.సి.ఎల్. సీనియర్ మేనేజర్ కాళీ నరసింహం, తదితరులు పాల్గొని మొక్కలను నాటారు.

ఇళ్ల నిర్మాణ పనులు మరింత చురుగ్గా సాగాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, రోజుకు 150 నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. లేఅవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాలకు మేరకు స్టేజ్ కన్వెర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, లేఅవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ.. గుత్తేదార్లను అప్రమత్తం చేస్తూ పనుల్లో జోరు పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకెళ్లాలని, మరింత పురోగతి సాధించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఈఈ, డీఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 58వ వార్డు పరిధిలోని శ్రీహరిపురంలో ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు బుధవారం పాల్గొని పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు, కొత్త రేషన్ కార్డులు మంజూరు వంటి సమస్యలపై వినతులు స్వీకరించారు. అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి చొరవ చూపి పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులకు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము, ములగాడ ఎమ్మార్వో భుజంగరావు, విద్యుత్ అధికారులు ఏవో, జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయర్స్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వెంకట్ విద్యాపీఠ్ విద్యార్థులు

విశాలాంధ్ర - ఆనందపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శొంఠ్యాం శ్రీ వెంకట్ విద్యాపీఠ్ పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని అండర్ 17, అండర్ 19 బాల బాలికలకు జిల్లా స్థాయి ఖట్కా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 17, 19 విభాగాలలో శ్రీ వెంకట్ విద్యా పీఠ్ నుండి 12 మంది బాలికలు, 8 మంది బాలురు, శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి 8 మంది బాలురు, సొంఠ్యాం హైస్కూల్ నుండి 4 గురు బాలికలు, ఆకాష్ కాలేజ్ నుండి ఇద్దరు బాలురు మొత్తం 32 మంది బాల బాలికలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకట్ విద్యా పీఠ్ చైర్మన్ రొంగలి వెంకటేశ్వరరావు, ఇన్వెంటివ్ ప్రైమ్ అకాడమీ ఖట్కా కోచ్ లెంక అప్పల రాము, కరెస్పాండెంట్ పద్మ, ప్రిన్సిపాల్ కుమారి సత్యవేణి పాల్గొన్నారు. శ్రీ వెంకట్ విద్యా పీఠ్ ప్రిన్సిపాల్ కుమారి సత్యవేణి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ఈ నెల 9, 10వ తేదీలలో చిత్తూరు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఖట్కా పోటీలలో విజయకేతనం ఎగరవేయాలని కోరారు.

భిన్న వయస్కుల వారు ఆత్మీయ బంధాలతో జీవించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: యువకులు, వృద్ధులు కలసి మెలసి అనుభవాలను పంచుకోవాలని హెరిటేజ్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ కె.ఆర్.గంగాధరన్ అన్నారు. స్థానిక ఆంధ్ర విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సెమినార్ హాల్లో హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాంతీయ విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, యువతరం కలసి మెలసి ఉండడం వల్ల ఒకరి జ్ఞానాన్ని మరొకరు పంచుకొంటారని, ఒకరికొకరు సహకారం అందించుకొంటారని, ఆర్థిక లాభాలను పొందుతారని, ఒత్తిడి నుండి బయటపడతారని ఆయన అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ సర్వసిద్ధి హరినాథ్ మాట్లాడుతూ వృద్ధులకు, యువతరానికి మధ్య తరాల అంతరం, సమాచార అంతరం పెరుగుతున్నాయని, ఇది దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆర్ట్స్, కామర్స్ కళాశాలల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, జాతీయ సేవా పథక జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, సీనియర్ ఆచార్యులు డాక్టర్ ఎన్. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - భీమిలి: వెలుగు వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భీమిలి రూరల్ ఏరియా వీఓఏ నాయకులు ఉత్తడ పార్వతి, సమ్మిటి గున్న మాట్లాడుతూ రోజు రోజుకి ప్రభుత్వం వీఓఏలకు పని భారం పెంచుతూ కొత్త కొత్త యాప్‌లు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని చాలీచాలని జీతాలతో తమ కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. సీఐటీయూ భీమిలి జోన్ నాయకులు ఎస్.అప్పల నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మూడు సంవత్సరాల కాలపరిమితి గల సర్క్యులర్‌ని రద్దు చేస్తామని అప్పట్లో టీడీపీ తరపున వర్ల రామయ్య మాట ఇచ్చారని మరలా ఇప్పుడు ఈ సర్క్యులర్ ముందుకు తీసుకురావడంలో ప్రభుత్వం ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. సీఐటీయూ భీమిలి జోన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయాలలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం కనీస వేతనాలు 26,000 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతిన వెంకటలక్ష్మి, కోనాడ కళ్యాణి, సమ్మిటి గున్న, చీరపు సంతోష్ కుమారి, ఆరిశెట్టి నిర్మల, కొమ్ము వెంకటలక్ష్మి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండల కాంప్లెక్స్ పరిధిలో ఉన్న వెలుగు కార్యాలయం ఎదుట బుధవారం టెంట్ వేసి వీవోఏలు ధర్నా కార్యక్రమాన్ని సీఐటీయూ భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న 22 గ్రామపంచాయతీలో ఉన్న వీవోఏలు పాల్గొని మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వివోఏల సమస్యలు పరిష్కరించాలని, వివోఏలపై గ్రామస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీవోఏల సంఘం అధ్యక్షులు పి.కంచమ్మ, ఆర్.రామలక్ష్మి, బి.లీల, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి పట్టణ ప్రణాళిక ప్రాధాన్యం

8న ప్రపంచ పట్టణ ప్రణాళికా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రపంచ పట్టణ ప్రణాళికా దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 8న జరుపుకుంటారు. సుస్థిర, జీవనానికి అనుకూల, సుశ్రీకృత పట్టణాల నిర్మాణంలో పట్టణ ప్రణాళిక కీలక పాత్రను కలిగి ఉంది. పట్టణ ప్రణాళికా విధానాలు ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడంలో పర్యావరణ పరిరక్షణలో చేసే కృషిని గుర్తించడం జరుగుతుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికకర్తలు పట్టణ విస్తరణను నియంత్రించడం, హరిత ప్రదేశాలను అభివృద్ధి చేయడం, భూమి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తున్నారు. అభివృద్ధి కొనసాగుతున్న నేపథ్యంలో జనాభా పెరుగుదల, వనరుల కొరత, వాతావరణ మార్పులు వంటి సవాళ్లకు పట్టణ ప్రణాళిక సమర్థవంతంగా స్పందిస్తోంది. అత్యవసర మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, సురక్షిత హౌసింగ్ వంటి అంశాల్లో సానుకూల మార్పులు తెచ్చేందుకు పట్టణ ప్రణాళిక ముందుకు వస్తోంది. పర్యావరణ పరిరక్షణ చర్యలు, వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ వంటి చర్యలు పట్టణ ప్రణాళికలో భాగంగా ఉండటం ద్వారా వాతావరణంపై ప్రభావాన్ని తగ్గించడం సాధ్యమవుతోంది. ఈ సందర్భంగా ప్రపంచం నలుమూలల ప్రణాళికకర్తల సేవలను గుర్తిస్తూ, పట్టణ ప్రణాళిక సుస్థిరమైన భవిష్యత్తు కోసం చేసే కృషికి ఈ రోజు విలువనిస్తుంది.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు పట్టణాల అభివృద్ధిలో తమ వంతు బాధ్యతను సత్ఫలితాలతో నిర్వర్తిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణ ప్రణాళిక మరింత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. స్మార్ట్ సిటీస్, పారిశ్రామిక ప్రగతి, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలలో సమగ్ర ప్రణాళిక అవసరం అన్నారు. సమగ్ర ప్రణాళికా బద్ధమైన చర్యలతో తమ కృషిని కొనసాగించాలని మున్సిపల్ ఉద్యోగులందరికి అభిలషిస్తున్నానన్నారు.

SHRIRAM శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము: 9/3-ఎ3, ఆంధ్రాబ్యాంక్ మిద్దిపైన మెయిన్‌రోడ్డు, పులివెందుల - 516390, కడప జిల్లా

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేదీ: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేది: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిష్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిష్టరు కాబడి వారి **రిజిష్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడ మైనది. బ్రాంచ్ కార్యాలయము: పులివెందుల** (ఇకపై కంపెనీ / లెండర్‌గా పిలువబడతారు)

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా

1) డి. భవ్య, భర్త వై.యస్.గణేష్‌రెడ్డి, డి.నెం.4-2-122, మాధురి ఐస్ ఫ్యాక్టరీ, పులివెందుల, కడప జిల్లా
2) వైయస్.గణేష్‌రెడ్డి, భార్య డి.భవ్య, అక్కాయపాలెం, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా -530016
3) **కె.సాయిప్రదీప్ కుమార్‌రెడ్డి,** తండ్రి కె.చెన్నక్రిష్ణారెడ్డి, డి.నెం.2-45-ఎ, తాతిరెడ్డిపల్లి, పులివెందుల, కడప జిల్లా - 516396

ఎన్‌పిఏ తేది: 03.03.2024 డిమాండ్ నోటీసు తేది: 28.10.2024
ఋణ మొత్తం రూ.25,00,000 (ఇరవై ఐదు లక్షల రూపాయలు మాత్రమే)
డిమాండ్ నోటీసు అమౌంట్: రూ.51,20,702/- (యాభై ఒక్క లక్షల ఇరవై వేల ఏడు వందల రెండు రూపాయలు మాత్రమే)

PLVDLTF2308280004 - స్థిరాస్తి వివరములు

వైయస్‌ఆర్ కడప జిల్లా, కడప రిజిస్ట్రేషన్ జిల్లా, పులివెందుల సబ్ జిల్లా, భాకరాపురం గ్రామ లెక్కదాఖలా సర్వేనెం.5/2, ప్లాటునెం.57 & 58 భాగములోని స్థలం యొక్క విస్తీర్ణం 500 చ.గ. హద్దులు: తూర్పు: ప్లాటు నెం.56 మరియు 55 పడమర: 30అ. వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.58 భాగము, దక్షిణం: 30అ. వెడల్పు గల రోడ్డు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 60అ. లేదా 18.288 మీ. ఉత్తరం నుండి దక్షిణం: 75అ. లేదా 22.860 మీ. వెరశి 500 చ.గ.లు

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించ వలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియ జేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం : కడప
తేది :06.11.2024

సం/- అధీకృత అధికారి,
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సంగివలసలో మురుగునీటి కాలుష్యం

విశాలాంధ్ర - భీమిలి: జీవీఎంసీ భీమిలి జోనే 1 పరిధిలో వున్న సంగి వలసలో కళ్యాణ్ కృష్ణ రెసిడెన్సీలో మూడు అపార్ట్మెంట్‌లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పగిలి పోయి కాలుష్యంతో కూడిన మురికి నీరు ఆయా మంచి నీటి బోర్‌ల గుండా కలసిపోయింది. దీంతో ఆ అపార్ట్మెంట్‌లలో సుమారుగా 300 మంది నివసిస్తున్నారు. వీరు గత నెల రోజుల నుండి నేటి కలుషితం వలన ఇదే నీరు త్రాగడం వంటలకు ఇతర అసరాలకు వాడుక ద్వారా దురదలు డెంగ్యూ జ్వరాలు, డయేరియా బారిన పడుతున్నారని వాపోయారు. ప్రస్తుతం త్రాగునీటి కొరకు బయట నుండి కెన్ ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నప్పటికీ ఈ బోర్లలో నీరు వాసన రావడం తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని దీనిపై పలు మార్లు అధికారులకు తెలియజేసిన ఏదో అప్పటికి అప్పుడు చర్యలు చేపట్టిన సమస్య తీరలేదు. డ్రైనేజీ పూర్తిగా షిదిలమైంది వెంటనే నూతన డ్రైన్ ను వెంటనే నిర్మించి మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారి వెంటనే స్పందించాలని అపార్ట్మెంట్ వాసులు చిరంజీవి, మాధవరావు, మోహన్ కుమార్, గుమ్మడి శ్రీనివాస్, శేషాద్రి పలువురు కోరుతున్నారు.

తునివలస పంచాయతీ కార్యదర్శికి మెమో

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండల అభివృద్ధి అధికారి ఎం విజయ్ కుమార్ మండలంలోని తునివలస గ్రామ సచివాలయన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అదే సమయంలో ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి బివి రవి కార్యాలయంలో అందుబాటులో లేరు, ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కార్యాలయం వదిలి వెళ్ళడం జరిగింది. సచివాలయంలోని అటెండెన్స్ రిజిస్టర్లు, మూమెంట్ రిజిస్టర్లు ,ఈ సర్వీస్ రిజిస్టర్లు, మొదలైన వాటిని తనిఖీ చేశారు. మూమెంట్ రిజిస్టర్ లో బుధవారం ఎటువంటి నమోదులు లేవు, ఇతర రికార్డులను సచివాలయ ఉద్యోగులను అడగగా సదురు రికార్డులు బీరువాలో కలవని చెప్పినారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉండటం వల్ల తునివలస పంచాయతీ కార్యదర్శి బివి రవికి ఎంపీడీవో మెమో జారీ చేయడం జరిగింది.

జగన్నాథపురంలో పారిశుధ్య లోపం పట్టించుకోని అధికారులు..

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో పారిశుధ్యం లోపించింది. ఐటి బీటీ బెటాలియన్ క్వార్టర్స్‌లో ఆహార, వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ బ్యాగులతో చెత్తను ఇష్టాను సారంగా జగన్నాథపురం చెరువు సమీపంలో వేయడం వలన చెరువు నీరు కలుషితమై ఆ నీరుని పశు వులు తాగడం వలన వివిధ రకాల వ్యాధులు బారిన పడి చనిపోతున్నాయి. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మారుతి సుజుకి డిజైర్ ప్రీ బుకింగ్స్ ప్రారంభం

విశాలాంధ్ర- విశాఖపట్నం: ప్రముఖ ప్యాసింజర్ వాహన తయారీదారు మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తమ అత్యధికంగా అంచనా వేయబడిన 4వ తరానికి చెందిన డిజైర్ బుక్కింగ్స్ ప్రారంభించింది. భారతదేశపు అత్యధికంగా విక్రయించబడే పొందికైన సిడాన్, సరికొత్త డిజైర్ తమ పురోగమించే డిజైన్, విభాగంలో మొదటి ఫీచర్లు మరియు సాటిలేని విలువ ప్రతిపాదనతో విభాగంలో సంచలనం కలిగించడానికి సిద్ధంగా ఉందని మారుతి సుజుకి ప్రతినిధి పార్థో బెనర్జీ వెల్లడించారు. డిజైర్ బ్రాండ్ యొక్క గుర్తించదగిన వారసత్వం ఆధారంగా, ఈ కొత్త తరం మోడల్ భారతదేశపు మార్కెట్ కు సాటిలేని వాహనాలను అందించడానికి మారుతి సుజుకీ నిబద్ధతలో గణనీయమైన ముందడుగుని సూచిస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని గొట్టిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గొట్టుపల్లి కల్లాలు చెందిన పోలిపల్లి కాశీ విశ్వేశ్వరరావు (49) ఇంటి వద్ద నుండి జిరాక్స్ పని నిమిత్తం రోడ్డు దాటుతుండగా గొట్టుపల్లి నుండి ఆనందపురం వస్తున్న బైకు అదుపుతప్పి ఢీకొనడంతో కాశి విశ్వేశ్వర రావు తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాయత్రి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాయత్రి నుండి కేజీహెచ్‌కు తరలించగా విశ్వేశ్వర మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాశీ విశ్వేశ్వరరావు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్సై పందిరి శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక వేత్త బి.వి.రామారావు అస్తమయం

విశాలాంధ్ర - విశాఖ సిటీ; ప్రముఖ పారిశ్రామికవేత్త బి.వి.రామారావు తుది శ్వాస విడిచారు. ఆరోగ్యం క్షీణించడంతో గడిచిన కొద్ది రోజులుగా మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. భార్య సతీ సావిత్రి, కుమార్తె వసంతలక్ష్మి, కుమారుడు బి.వి.రామ్ ఉన్నారు. బి.వి.రామారావు పార్థివ దేహాన్ని పాత వెంకోజీ పాలెం లోని ఎం.వి.వి.ప్రెసిడెన్సీలో బుధవారం మధ్యాహ్నం నుంచి అభిమానులు, శ్రేయోభిలాషుల దర్శనార్థం ఉంచారు. బి.వి.రామారావు అంత్యక్రియలు గురువారం రాజమండ్రిలో నిర్వహిస్తామని బి.వి.రామ్ తెలిపారు. బి.వి.రామారావు పార్థివ దేహాన్ని పెద్ద సంఖ్యలో అభిమానులు, మహిళలు, ప్రముఖులు కడసారి దర్శించుకుని నివాళులు అర్పించారు. బి.వి.రామారావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వల్ల పారిశ్రామికంగా కూడా ఎంతో ప్రయోజనాలు పొందామని తలంచుకున్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో ఎమ్మెల్యే గణబాబు

విశాలాంధ్ర - మల్కాపురం: గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను పరిష్కరించుకొని పారిశ్రామిక ప్రాంతం 61 వ వార్డు రెడ్డి వీధిలో టిడిపి సీనియర్ నాయకులు కాకి పోలిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి బుధవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు మజ్జి సోమేష్, మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి, టిడిపి నాయకులు ఉరుకుటి మురళి, పైడిరాజు, స్థానిక నాయకులు, మహిళా తదితరులు పాల్గొన్నారు.

రెండు కొత్త 7-సీటర్ వేరియెంట్స్‌తో హెక్టార్ శ్రేణిని విస్తరించిన జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: రెండు కొత్త 7-సీటర్ వేరియెంట్స్ తో హెక్టార్ శ్రేణిని జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటర్స్ ఇండియా విస్తరించిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం ఎస్ యువి అనుభవాన్ని కోరుకునే కస్టమర్ల కోసం విశాలమైన ఆప్షన్ ను అందిస్తుందన్నారు. సివిటి ట్రాన్స్ మిషన్ తో జత కలిసిన 1.5 టి ప్రెటోల్ ఇంజన్ ద్వారా ద సెలక్ట్ ప్రో మద్దతు చేయబడి, సాఫీ సమర్థవంతమైన డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తోందన్నారు. ఎస్ యువి ఔత్సాహికుల అంచనాలకు అనుగుణంగా ఉంటాయి అధిగమించడాన్ని కొనసాగిస్తాయని మేము విశ్వసిస్తున్నామనీ సతీందర్ సింగ్ బజ్వా, ఛీఫ్ కమర్షియల్ అధికారి, జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా అన్నారు. పోటీయు తమైన ధరతో, హెక్టార్ కొత్త వేరియెంట్లు రోడ్డు పై తమ ఆధిపత్యంవహించే ఉనికి, ఆధునిక టెక్నాలజీ మరియు గొప్ప డ్రైవింగ్ సౌకర్యం సహా అన్ని కీలకమైన ఫీచర్లు మరింత అందుబాటులో ఉండేలా చేయడంతో హెక్టార్ ఒక ప్రముఖమైన ఎస్ యువిగా పేరు పొందిందన్నారు. దీని విజయం ఆధారంగా, కొత్త సెలక్ట్ ప్రో స్మార్ట్ ప్రో వేరియెంట్లు భారతదేశపు అతి పెద్ద 14-అంగుళాల హెచ్ డి పోర్ట్ రైట్ ఇన్ఫోటైన్మెంట్ వ్యవస్థ, ఐ,- స్మార్ట్ టెక్నాలజీతో మెరుగైన కారు లోపలి ఇన్ఫోటైన్మెంట్ అనుభవాన్ని 75 కనక్టెడ్ కారు ఫీచర్లు, వైర్ లెస్ యాపిల్ కార్ ప్లే ఆండ్రాయిడ్ ఆటో మరియు వైర్ లెస్ ఫోన్ ఛార్జర్ తో అందిస్తున్నాయన్నారు. కంపెనీ యొక్క ప్రీ-పెయిడ్ నిర్వహణ ప్యాకేజీలు మనశ్శాంతిని మరియు ఒత్తిడిరహితమైన యాజమాన్య అనుభవాన్ని అందిస్తాయన్నారు.

రెండు గ్రామాల్లో పొలంబడి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో బోని జగన్నాథపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బి .విజయప్రసాద్ మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుంది అని వివరించారు. క్వింటా ధాన్యం ధర కామన్ రకం రూ.2300/- గ్రేడ్ ఏ రకం రూ.2320/- అని తెలిపారు. అదే విదంగా రాగి పంట గిట్టుబాటు ధర క్వింటా కి 4290/- రూ ఉండటం వల్ల రెండో పంటగా వరికి బదులుగా రాగి పంటను వేసుకోవాలని డి ఆర్ సి వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్రమణ్యం మాట్లాడుతూ రెండో పంటగా వరి నువ్వులలో మేలైన రకాలను వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చునని తెలిపారు ఈ కార్యక్రమంలో మండల ఏవో సంధ్యా రత్నప్రభ, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ దిలీప్ చక్రవర్తి, మాధురి రైతులకు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలను వేధిస్తున్న చంద్రబాబుకు గుణపాఠం తప్పదు
వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసిపి కార్యకర్తలను వేధిస్తున్న చంద్రబాబుకు గుణపాఠం తప్పదని ఎంపీ, ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ సమన్వయకర్త వి. విజయసాయిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం విశాఖ ఎయిర్ పోర్టులో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని, రెండు రోజుల్లో కూటమి ప్రభుత్వం 100 మందిని అరెస్టు చేసిందన్నారు. చంద్రబాబు చేసే పాపాలు నాగుపాములై లోకేష్‌ను కాటేస్తాయన్నారు. చంద్రబాబు చేసే పాపానికి పదింతలు శిక్ష లోకేష్ అనుభవిస్తారన్నారు. అధికారం శాశ్వతం కాదనే అంశాన్ని చంద్రబాబు గుర్తుపెట్టుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంగించి వైఎస్ఆర్సిపి కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని, వైయస్సార్సీపీ కార్యకర్తలపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారన్నారు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు వైఎస్ఆర్సీపీ అండగా ఉంటుందన్నారు. పవన్ కళ్యాణ్ ను కూటమిలో ద్వితీయ శ్రేణి పౌరునిగా చూస్తున్నారని, అధికారంలోకి రాక ముందు పవన్ కళ్యాణ్ కాళు లోకేష్ పట్టుకున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ చెప్పిన మాట వినొద్దు అంటూ అధికారులకు లోకేష్ చెప్తున్నాడన్నారు. పవన్ పై మందకృష్ణ మాదిగ విమర్శలు చంద్రబాబు మార్కు రాజకీయానికి నిదర్శనం అన్నారు. లోకేష్ రాజకీయ ఎదుగుదల కోసం పవన్ కళ్యాణ్‌ను చంద్రబాబు తొక్కు పెడుతున్నారని అన్నారు. 2027 తర్వాత మేమే మళ్ళీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

స్థలాలు ఇచ్చిన రైతులకు అన్యాయం...

విశాలాంధ్ర - ఆనందపురం: గత 20 సంవత్సరాల క్రితం నేషనల్ హైవేకి స్థల సేకరణ చేసినప్పుడు పెద్దిపాలెం గ్రామానికి చెందిన పట్టా భూములను చైన్ జి 680-681 వరకు రోడ్డుకు రెండు వైపులా హైవేకి అప్పట్లో స్థానిక ప్రజలు ఇవ్వడం జరిగిందని అప్పట్లో స్వచ్ఛందంగా భూములు ఇచ్చామని నేషనల్ హైవే అధికారులు రోడ్డు పనులు మొదలుపెట్టినప్పుడు వక్కనే సర్వీస్ రోడ్డు వేసినప్పుడు మా ఇంటి స్థలాలు పొలాలకు చాలా ఎత్తుగా రోడ్డు ఉన్నందున మాకు ఇబ్బంది అని చెప్పినప్పటికీ, అప్పట్లో రోడ్డు కాలువకు అభ్యంతరం చేయగా డ్రైనేజీ కంటే రోడ్డు ఎత్తుగా ఉందని హైవే అధికారులు తెలియపరిచారు. తర్వాత హైవే నిర్మాణం పూర్తయి రోడ్డు కంటే డ్రైనేజీ కాలువలు రెండు అడుగులు ఎత్తుగా ఉండడం వీటి వలన మా నివాసాలకు వెళ్లి రావడానికి పంట పొలంలోకి ట్రాక్టర్లు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు హాస్పిటల్‌కి వెళ్లాలన్న తరచు వాహనాల్లో తరలించడానికి నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పలుమార్లు నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ వారి నుంచి ఎటువంటి స్పందన లేదని అందువల్ల ఈ సమస్యను గ్రామపంచాయతీ గ్రామ సభ ద్వారా తీర్మానం చేసినప్పటికీ అధికారుల నుంచి ఎటువంటి పరిష్కార మార్గం లేదని, ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకొని సొంత ఖర్చులతో డ్రైనేజీ కాలువ ఎత్తును తగ్గించి నేషనల్ హైవే రూల్స్ ప్రకారం నాలుగో అంగుళాలు ఎత్తుకు డ్రైనేజీ కాలు నిర్మాణానికి ఏర్పాట్లు తీసుకున్నామని ఇప్పుడు వాటిని కూలదీసి మమ్మల్ని మా కుటుంబాల్ని మానసిక ఇబ్బందులకు పెడుతున్నారని, ఈ విషయంపై నేషనల్ హైవే అధికారులు, జిల్లా అధికారులు ప్రభుత్వ ప్రతినిధులు శాశ్వత పరిష్కారం చేయాలని పెద్ది పాలెం పంచాయతీ గ్రామ ప్రజలు కోరుచున్నారు.

ఘనంగా బిఎస్సీ గ్రాడ్యుయేషన్ ప్రదానోత్సవం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రముఖ నర్సింగ్ విద్యాసంస్థలు సెయింట్ లూక్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, విజయా లూక్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సంయుక్త ఆధ్వర్యంలో బిఎస్సీ గ్రాడ్యుయేషన్ ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.నగరంలోని సిరిపురంలో గల వివిఎంఆర్డిపి చిల్డ్రన్స్ ఎరీనాలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖపట్నం లోక్ సభ సభ్యుడు ఎమ్.శ్రీ భరత్ హాజరై బిఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన పట్టభద్రులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో ప్రధానంగా మన రాష్ట్రంలో నర్సింగ్ విద్య అభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విదేశాలకి వెళ్లాల్సిన అవసరం లేకుండానే మంచి వేతనాన్ని గౌరవప్రదమైన ఈ నర్సింగ్ వృత్తితో పొందగలుగుతున్నారని తెలిపారు. మాజీ ఎంపీ ,గీతం వర్సిటీ పూర్వ చైర్మన్ దివంగత ఎమ్. వి. ఎస్.మూర్తితో గీతం వర్సిటీకి ప్రక్కనే ఉన్న సెయింట్ లూక్స్ విద్యా సంస్థలతో ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో 100మంది నర్సింగ్ విద్యార్థినీ,విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. సెంటర్ ఫర్ యోగ అండ్ వెల్నెస్(ఏ యూ అనుబంధం)లో పీజీ డిప్లమో, డిప్లమో పూర్తి చేసిన విద్యార్థుకూ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించారు. గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్ సర్జరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.అర్జున మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంతో సేవా దృక్పథం కలిగిందని, రోగులకు ప్రాణం పోసేది డాక్టర్లతో పాటు నర్సులేనన్నారు. గత 36 ఏళ్లుగా సెయింట్ లూక్స్ నర్సింగ్ విద్యాసంస్థలు వేలది మంది నర్సులను ట్రైనింగ్, ప్లేస్ మెంట్ కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ప్రభాకర్ శర్మ (అమెరికా),ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫ్స్,ఏఎన్ఎం అండ్ హెల్త్ విజిటర్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల,గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజ్ సర్జరీ విభాగం హెడ్ ప్రొఫెసర్ జి.అర్జున, టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి,సెయింట్ లూక్స్ విద్యాసంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ప్రీతం లూక్,ప్రతినిధులు ఎం.విజయా లూక్,మమతా ప్రసాద్,షావీలా ప్రీతం,షైనీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా వెల్లంకి గ్రామ రెవెన్యూ సభ

విశాలాంధ్ర - ఆనందపురం: వెల్లంకి గ్రామపంచాయతీలో బుధవారం ఉదయం రీసర్వేపై మండల ఈ సర్వే డీటీ గోవిందరావు గ్రామస సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ చేతన్ కుమార్ స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించని కార్యక్రమంలో రైతులు గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేపై జరిగిన సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. విస్తీర్ణం తక్కువగా ఉండడం, జగనన్న పట్టాదారు పాస్ పుస్తకాల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయని పలువురు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. కొలతల్లో తేడా ఉన్నదని కొంత భూములు పాసుబుక్కులు ఇవ్వలేదని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన భావన నర్సింగ్ రావు(60) తండ్రి అప్పలస్వామి సర్వే నెంబరు 116/4లో 10 సెంటులకు నాలుగు సెంట్లు పాస్బుక్లు ఇచ్చారని పాస్బుక్ లో తన ఫోటోకు బదులుగా వేరే వారి ఫోటో ఉండటంపై అనేకసార్లు తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కంచిబోయిన శ్రీనివాసరావు సర్వేనెంబర్ 278లో గెడ్డ వాగు కబ్జాకు గురైందని సుమారు 40 ఎకరాల స్థలములు బడాబాబులు బోర్లు, గెస్ట్ హౌస్లు ఏర్పాటు చేసుకొని ఆక్రమకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, ఉపసర్పంచ్ కంచరావు శ్రీను ,నాయకులు చెన్నా నర్సింగరావు, చెన్నాసత్యం ,పడాల రమణ, ప్రసాద్ రావు పట్నాయక్, తోనంగి అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపుల కోసం క్యూఆర్ కోడ్‌ని ఉపయోగించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డిజిటల్ ఇండియా కోసం చొరవకు అనుగుణంగా, ఈస్ట్ కోస్ట్ రైల్వే యొక్క వాల్టెయిర్ డివిజన్ అన్ని స్టేషన్‌లలోని అన్ని స్టేషన్లలోని అన్ని పీఆర్ఎస్ (ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్స్) యూటీఎస్ (అన్ రిజర్వ్ టికెటింగ్ సిస్టమ్) స్థానాలకు క్యూఆర్ కోడ్ టికెటింగ్‌ను ప్రవేశపెట్టింది. ఇక్కడ ప్రయాణికులు చెల్లింపులు చేయవచ్చు. వివిధ డిజిటల్ చెల్లింపు మాడ్యూల్స్. అవాంతరాలు లేని డిజిటల్ లావాదేవీల కోసం ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకునేలా రైలు వినియోగదారులకు అవగాహన కల్పించడానికి వాల్టెయిర్ డివిజన్ విస్తృతమైన అవగాహన డ్రైవ్‌లను ప్రారంభించింది. భారతీయ రైల్వే క్యూఆర్ కోడ్‌లను అమలులోకి తెచ్చింది. దీని ద్వారా ప్రయాణీకులు తమ ఫోన్‌లతో ఆన్‌లైన్ చెల్లింపులు చేయవచ్చు. వాల్టెయిర్ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్‌లలో టిక్కెట్‌లను కొనుగోలు చేసేటప్పుడు చెల్లింపుల కోసం క్యూఆర్ కోడ్‌ల స్కానర్‌లను అమలు చేసింది. ఈ ఫీచర్ టిక్కెట్ కౌంటర్లలో అందుబాటులో ఉంటుంది. స్టేషన్లలో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకొని క్యూలో నిల్చోవాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో తమ పేపర్‌లెస్ టిక్కెట్‌ను కొనుగోలు చేయవచ్చని డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

ఎస్‌హెచ్‌జి ప్రొఫైల్ యాప్ వినియోగంపై ఆర్.పిలకు శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆర్.పిలు ఒక శక్తిగా ఉండాలని స్లమ్ అనే పదంకు మార్పుపలికేలా విధులు నిర్వహించాలని, ప్రజలకు సేవలందించడంలో, పథకాల అమలులో అవగాహన చేపట్టడం పై ఆర్.పి లు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు బుధవారం ఆయన గురజాడ కళాక్షేత్రంలో ఎస్ హెచ్ జి ప్రొఫైల్ యాప్ వినియోగం, విధి విధానాల పై జీవీఎంసీ స్థాయిలో ఆర్.పిలకు వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఆర్పీలు ఒక శక్తిగా ఉండాలని స్లమ్ అనే పదానికి మార్పుకు నాంది పలుకుతూ విధులు నిర్వహించాలని, పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని ఆ దిశగా ఈ ఎస్.హెచ్.జి ప్రొఫైల్ యాప్ ను నవంబర్ 31 లోగా పూర్తి వివరాలతో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కమీషనర్ ఆర్పిలకు సూచించారు. ప్రధానంగా ఆర్పీలు వారి వారి ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు ప్రతి ఇంట రోజు ఉత్పత్తి అయ్యే వ్యర్థాల విభజన, సేకరణ, తరలింపు, రోడ్ల పరిశుభ్రత, కాలువల లో వ్యర్థాలు పేరుకు పోకుండా గమనించి వాటిని నిర్ణీత సమయంలో పరిశుభ్రత దిశగా మార్పుకు సహకరించాలని, అపరిశుభ్రత నిర్మూలనకు ఆర్పీలు నడుం బిగించాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రగతిలో ఆర్పీలు చాలామంది వెనుకబడి ఉన్నారని ఆర్పీలు ప్రగతి మార్పుకు నాంది పలకాలని, ముఖ్యంగా కోవిడ్ తర్వాత చాలా కుటుంబాలు పేదరికంలోకి వెళ్లాయని, అటువంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు, విధివిధానాలను రూపొందించిందన్నారు. ముఖ్యంగా పిల్లల చదువులకు, అక్కరలేని ఆడంబరాలకు ప్రజలు విపరీతమైన ఖర్చులు చేసి పేదరికంలోనికి వెళ్ళిపోతున్నారని అటువంటివారిని గమనించి వారికి పేదరికానికి గురికాకుండా సలహాలు అందించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమీషనరు డి.వి.రమణ మూర్తి, పిడి-యుసిడి పి.ఎమ్.సత్యవేణి, ప్రాజెక్ట్ అధికారులు, డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారులు, మెప్మ యుసిడి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లి పరిసర ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్ 7 అనకాపల్లి పరిధిలో తుంపాల పంప్ హౌస్ నుండి అనకాపల్లి లో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను లీక్ అయినందున నేడు అనకాపల్లి ప్రాంతాలలో ప్రజలకు తాగునీటికి అంతరాయం కలుగుతుందని నీటి సరఫరా విభాగం కార్య నిర్వహక ఇంజనీరు మురళీకృష్ణ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. అనకాపల్లి పరిధిలోని ఉన్న 6 రిజర్వాయర్లకు మంచినీరు అందించే ప్రధాన పంపి లైన్ 600 ఎమ్.ఎమ్ సైజు గల పి ఎస్ పి పైపులైను లీక్ అయినందున దానిని మరమ్మత్తులు చేయు నిమిత్తం నేడు అనగా నవంబర్ 7వ తేదీ గురువారం అనకాపల్లి పరిసర ప్రాంతాలకు తాగునీరు సరఫరా నిలిపివేయబడునని కార్యనిర్వాహక ఇంజనీరు తెలిపారు. కావున తాగునీటి సరఫరాకు కలుగు అంతరాయానికి చింతిస్తూ జీవీఎంసీ కమిషనర్ తరఫున నగర ప్రజలు సహకరించవలసిందిగా కోరడమైనది. తాగునీరు అంతరాయమునకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా అవసరమగు ప్రాంతాలకు నీటి సరఫరా చేయబడునని కార్యనిర్వాహక ఇంజనీరు తెలిపారు.